క్లుప్తంగా

ఆశాజనకంగా మామిడిపూత



గుచ్చిమిలో పూతదశలో ఉన్న మామిడి చెట్టు

సీతానగరం: మండలంలోని జీడి మామిడి తోటలకు నీటివనరులు సమృద్ధిగా అందడం, అలాగే పూతదశలో వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మామిడి తోటల్లో ఎటు చూసినా పూతదశలో చెట్లు ఉన్నందున పిందెదశవరకూ ఇదేవాతావరణం కొనసాగితే లాభదాయకంగా ఉంటుందని రైతులు అంటున్నారు.

అప్పయ్యపేటలో కాలువ పనులు



కాలువ పనులను పరిశీలిస్తున్న నిర్వాహకుడు సూర్యనారాయణ

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేట జగనన్న కాలనీకి వెళ్లే రహదారిపై రూ.2 లక్షల వ్యయంతో కాలువల నిర్మాణం జరుగుతోందని ఎంపీటీసీ బి.కుసుమ తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీని ఎమ్మెల్యే అలజంగి జోగారావు సందర్శించిన సమయంలో కాలువ లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు విన్నవించిన మేరకు తక్షణమే కాలువ నిర్మాణానికి నిధులు మంజూరుచేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అభివృద్ధి పనుల నిర్వాహకుడు బి.సూర్యనారాయణ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామానికి ఇంటింటి కుళాయిలు, సీసీ రోడ్డు పనులు మంజూరైనట్లు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామవలంటీర్లు పాల్గొన్నారు.

నారుమడులు సిద్ధం



గవరమ్మపేట వద్ద సిద్ధం చేస్తున్న నారుమడి

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట, వెంకటరాజపురం తదితర గ్రామాల్లో రబీ వరిసాగుకు నారు మడులను రైతులు సిద్ధం చేస్తున్నారు. రబీలో వరిసాగుకు బదులు అపరాలు సాగు చేయాలని ప్రభుత్వం సూచిస్తున్నా.. బోరు బావుల కింద వరి తప్ప వేరే పంటలు పండవని రైతులు అంటున్నారు. పండిన ధాన్యాన్ని ప్రైవేటు వర్తకులకు అమ్ముకుంటామని రైతులు అనుకోవడం గమనార్హం.

మంచు దుప్పటి



మేదర వీధి పరిసరాల్లో దట్టంగా కురుస్తున్న పొగమంచు

పాలకొండ రూరల్: మూడురోజులుగా నియోజకవర్గ వ్యాప్తంగా చలి పెరిగిపోయింది. గ్రామాలు మంచుదుప్పట్లోకి వెళ్లిపోయాయి. ఉదయం, రాత్రి వేళల్లో మంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 8 గంటలైనా పొగమంచు వీడట్లేదు. చలికి ప్రజలు గజగజ వణికిపోతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు చలి తీవ్రతకు ఇబ్బందులు పడుతున్నారు. పొగమంచు కారణంగా రోడ్లుపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు సూర్యోదయం వేల మంచుతెరల మధ్య ప్రకృతి రమణీయతను సంతరించుకుని పర్యావరణ ప్రేమికులను ఆకట్టుకుంటోంది.

దళారులతో కలిసి రైతులను మోసగించే కుట్ర

పాలకొండ రూరల్: మిల్లర్లు దళారులతో కలిసి రైతులను మోసగించే కుట్ర చేస్తున్నారని ఏపీ రైతు సంఘం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ఆరోపించారు. పాలకొండ మండలం కొండాపురంలో ఆదివారం రైతు సంఘుల నాయకులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం రైతుకు మద్దతు ధర అందించాలని నిర్ణయించినా.. కొందరు మిల్లర్లు స్థానిక దళారులతో కలిసి రైతులను మభ్యపెడుతూ.. 80 కేజీల బస్తాకు 5 కేజీల ధాన్యం అదనంగా తూకం వేస్తున్నారని అన్నారు. సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ సహకారంతో రెండు నెలలుగా దళారుల దోపిడీని తాము అడ్డుకుంటున్నామన్నారు. పోరాటాల ఫలితంగా మద్దతు ధర పొందిన రైతుల వివరాలతో కూడిన కరపత్రాలు విడుదల చేశారు. రైతుల నుంచి అదనంగా ధాన్యం తూకం వేసినా, మద్దతు ధర ఇవ్వకున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. రైతులు ధాన్యం అమ్మకాలు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సమావేశంలో రైతు నాయకులు చేబోదుల లక్ష్మీనారాయణ, జి.అప్పలనాయుడు, కిమిడి రామూర్తినాయుడు, పి.వైకుంఠరావు, వి.కూర్మారావు, బి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాత జగనన్నను ఆశీర్వదించండి

- ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖా మంత్రి పీడిక రాజన్నదొర



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ప్రజాసంక్షేమం, అభివృద్ధి పాలనలో అందిస్తున్న సంక్షేమ, సువర్ణయుగ ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ప్రజలను కోరారు. పాచిపెంట మండలంలోని గురివినాయుడుపేట గ్రామంలో సర్పంచ్ గొట్టాపు చిట్టెమ్మ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజన్నదొరకు ప్రజలు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లిన రాజన్నదొర.. జగనన్నపాలనలో ఇప్పటివరకు ఎంత లబ్ధిచేకూరిందో వివరించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల పనితీరుపై ఆరా తీశారు. ప్రజల సమస్యలను విన్న ఆయన వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రాజన్నదొర ప్రజలతో మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి అందిస్తున్న నగదును మహిళలు సద్వినియోగం చేసుకుని, ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి ఇచ్చిన హామీలన్నింటిని ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొరిపల్లి ధనుంజయ, వైస్‌సర్పంచ్ ఈదుబిల్లి ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు, నాయకులు గొట్టాపు తిరుపతిరావు, మాదిరెడ్డి మధుసూదనరావు, నారాయణ, బోను మురళి తదితరులు పాల్గొన్నారు.

గంగిరెద్దుల హడావిడి



పార్వతీపురంలో ఓ ఇంటిముందు గంగిరెద్దు సందడి

పార్వతీపురం: రానున్న సంక్రాంతి పర్వదినం సందర్భంగా గంగిరెద్దులు పార్వతీపురం పట్టణం, పరిసర ప్రాంతాల్లో హడావిడి చేస్తూ పాత సంప్రదాయాలను గుర్తుచేస్తున్నాయి. పూర్తిగా అలంకరించిన ఎద్దులను ప్రతి ఇంటికీ తీసుకెళ్తూ తమ కళానైపుణ్యాన్ని చాటుకుంటూ యాచన చేస్తున్నారు. అయితే ఇది కేవలం సంక్రాంతి రోజుల్లో కన్పించే ముచ్చట. పెద్దల పండగ అనగానే ఇంటి ముంగిళ్లలో రంగవల్లులు, లోగిళ్లలో గంగిరెద్దుల సందడి, వీధుల్లో హరిదాసుల కీర్తనలు, జనాల్లో సందడి, పితృదేవతలను పొగుడుతూ కన్పించే జంగమదేవరులు, ఇంటిముందర గొబ్బిళ్ల సంప్రదాయాలను మరోమారు గుర్తుచేస్తుంటాయి. బొబ్బిలికి చెందిన అప్పన్న తనకున్న ఎద్దును గంగిరెద్దులా తయారు చేసి పల్లెల్లో పలు వీధుల్లో తిరుగుతూ సంప్రదాయాన్ని గౌరవిస్తున్నాడు. తమ జాతివారంతా సంక్రాంతి సంబరాల్లో ఇలాగే గంగిరెద్దులను తీసుకెళ్తూ యాచిస్తున్నామని ఆయన తెలిపాడు.

గజరాజులను తరలించండి



కందివలస సమీపంలో ఏనుగులు ధ్వంసం చేసిన ధాన్యం బస్తాలను చూపిస్తున్న రైతులు

కొమరాడ: కుమ్మరిగుంట పంచాయతీ పరిధిలో గత నెలరోజులుగా ఏడు గజరాజులు తిష్టవేశాయి. కందివలస గ్రామంలోని కళ్లాల్లో రైతుల నిల్వ చేసుకున్న ధాన్యం బస్తాలను ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి పూట ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఏనుగులను జంఝావతి డ్యాం అవతల ఉన్న అటవీ ప్రాంతంలోకి తరలించాలని అటవీశాఖ అధికారులను రైతులు కోరుతున్నారు.

నవరత్నాల అమలుతో అర్హులకు సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నవరత్నాల పథకాలు అమలు చేయడంతో ప్రతి కుటుంబంలో అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, పక్కాగృహాలు, ఇళ్లస్థలాల లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గుచ్చిమి కాలనీ, టి.సీతారాంపురం గ్రామాల్లో సర్పంచ్ మర్రా శ్రీదేవి, ఎంపీటీసీ సీహెచ్ జగదీశ్వరరావుల ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు గుచ్చిమి కాలనీలో గడపగడపకు కార్యక్రమాన్ని ప్రారంభించి అన్ని వీధులలో గడపగడపకు వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రభుత్వం అందించిన బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అలాగే ప్రభుత్వం నుంచి పొందుతున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకుని వారికి అర్హత ఉండి ఏమైనా సంక్షేమ పథకాలు అందకుంటే వాటి వివరాలు అడిగి తెలుసుకుని అధికారుల సమక్షంలో అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించారు. అలాగే ఇంటిస్థలాలు మంజూరు చేయాలని ఎస్సీ కుటుంబాల వారు కోరడంతో తక్షణమే వారి వివరాలను సేకరించి 90 డేస్ పథకం అమలుచేసి పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్ ఎన్వీరమణను ఆదేశించారు.

చర్చి నిర్మాణానికి సాయం

అలాగే ఎస్సీకాలనీలో ఆర్థిక పరిస్థితుల కారణంగా అసంపూర్తిగా నిలిచిపోయిన చర్చి భవనాన్ని పూర్తి చేయడానికి ఆర్థిక సాయం అందించాలని వృద్ధులు కోరడంతో రూ.1.50 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే సీతారాంపురంలో ఎన్నికల సమయంలో తారు రోడ్డు వేస్తామని ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగానే కోటి రూపాయల వ్యయంతో తారు రోడ్డు వేయించినట్లు చెప్పారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.రమణమ్మ, జెడ్పీటీసీ, ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బొంగు చిట్టిరాజు, బి శ్రీరాములు, పి ఈశ్వరనారాయణ, పీఏసీఎస్ ఛైర్మన్ సంజీవినాయుడు, బి.శంకరరావు, ఎం.మన్మథరావు, ఎం ధనుంజయనాయుడు, ఎన్.రామకృష్ణ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ హోదాల్లో సేవలందిస్తున్న పార్టీ శ్రేణులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గోదాదేవికి పొన్నాకుల హారతి



బలిజిపేట: రామాలయంలో గోదాదేవికి హారతులిస్తున్న భక్తులు



సీతానగరం: గోదాదేవిని పల్లకిలో ఉంచి తిరువీధి చేస్తున్న భక్తులు



సాలూరు: రామాలయంలో నిర్వహిస్తున్న పొన్నాకుల హారతి



పార్వతీపురం టౌన్: ప్రత్యేక అలంకరణలో గోదా తాండవకృష్ణులు

బలిజిపేట: ధనుర్మాసం సందర్భంగా వెంగాపురం రామాలయంలో గోదాదేవికి పొన్నాగ హారతి ఇచ్చారు. అర్చకుడు కె.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. 24వ పాశురంలో భాగంగా భక్తులు పొన్నాకుల హారతులను స్వామివారికి, గోదాదేవికి సమర్పించి భక్తిశ్రద్ధలతో తెల్లవారుజామున గోవిందనామాలతో తిరువీధి చేశారు. స్వామివారిని పుష్పాలతో అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో అర్చకుడు కె.సూర్యనారాయణ, మహిళా భక్తులు పాల్గొన్నారు.

సీతానగరంలో...

సీతానగరం: మండలంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని పలుగ్రామాల ఆలయాల్లో అభిషేకాలు, పూజలు జరుగుతున్నాయి. ఈ మేరకు స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి అమ్మవారిని అర్చకుడు పి శ్రీనివాసార్యులు ఆధ్వర్యంలో భక్తులు పల్లకిలో అధిష్టించి తిరువీధి చేశారు. గోవింద నామాలు ఆలపిస్తూ మేళతాళాలతో అమ్మవారిని ఊరేగించారు. గోవింద మాలధారులంతా అమ్మవారి పల్లకిని మోసి మొక్కులు తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన భక్తులతో పాటు ధనుర్మాస మాలాధారులు సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు నిర్వాహకులు ప్రసాదాల వితరణ చేశారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు

స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ మేరకు అర్చకుడు మాట్లాడుతూ అనునిత్యం స్వామివారిని దర్శించుకునేందుకు వందలాది కిలోమీటర్ల దూరం నుంచి భక్తులు రావడం పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు.

పార్వతీపురంలో..

పార్వతీపురం టౌన్: ధనుర్మాసం సందర్భంగా శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు జగన్నాథాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం పొన్నాకుల మంగళ హారతి ఇచ్చారు. వేకువజామున సుప్రభాతం, అర్చన, తోమాలసేవ, గోదా తాండవకృష్ణుల అర్చన, హారతి, నీరాజన మంత్ర పుష్పాలతో కార్యక్రమాలు నిర్వహించారు. మంళ హారతి కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సాలూరులో..

సాలూరు: పట్టణంలోని రామాలయంలో ఆదివారం స్వామి వారికి పొన్నాకుల హారతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

ప్లాస్టిక్ నిషేధం అతిక్రమిస్తే చర్యలు

- మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

పార్వతీపురం టౌన్: ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే అపరాధ రుసుముతో పాటు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారస్తులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. క్లీన్ పార్వతీపురంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినట్లు చెప్పారు. వ్యాపారస్తులు వాటిని విక్రయించినట్లతే జరిమానాతో పాటు సరుకు స్వాధీనం చేసుకుంటామన్నారు. పలుమార్లు పట్టుబడినట్లయితే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

బ్రిటిష్ వారి పాలిట సింహస్వప్నం నేతాజీ



నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖా మంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: బ్రిటిష్ పాలకుల పాలిట సింహస్వప్నం నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అని ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర కొనియాడారు. పాచిపెంట మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ పాఠశాలలో ఉపాధ్యాయుడు పంచాది కృష్ణారావు మాస్టారు సారథ్యంలో ఏర్పాటుచేసిన నేతాజీ విగ్రహాన్ని జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతాజీకి నివాళులు అర్పించి సుభాష్‌చంద్రబోస్ గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలి

- జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ

పార్వతీపురం టౌన్: విద్యార్థులు వారి తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలని జన విజ్ఞానవేదిక జాతీయ సలహాదారు, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్వతీపురంలోని ఏకలవ్య పాఠశాలలో ఆదివారం గిరిజన విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డు కాకూడదన్నారు. చదువు కోసం ఎన్నో అవమానాలు, ఇబ్బందులు, సమస్యలు అధిగమించి అంబేడ్కర్ లాంటి మేధావుల్లా లక్ష్యాన్ని చేరుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థి దశలో భవిష్యత్తు నాశనం చేసే అనేక పరిస్థితులు ఎదురవుతాయని వాటిని నియంత్రించుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గంటేడ గౌరునాయుడు, కార్యదర్శి పాలక రంజిత్, పాఠశాల ప్రిన్సిపాల్ పట్నాయక్, డి.చంద్రమౌళి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్ రహిత సమాజం కోసం విద్యార్థులు సహకరించాలి



మాట్లాడుతున్న ఎస్సై కె.నీలకంఠం

సీతానగరం: మత్తు పదార్థాల రహిత సమాజాన్ని స్థాపించడానికి విద్యార్థులు యువతీ, యువకులు సహకరించాలని ఎస్సై కె.నీలకంఠం పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన మండలంలోని జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయం మెయిన్ గేట్‌కు డ్రగ్ రహిత సమాజం కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని విద్యార్థుల చేత వేలాడదీయించారు. అనంతరం మాట్లాడుతూ మత్తు పదార్థ రహిత సమాజాన్న స్థాపించడానికి యువత ముందడుగు వేయాలని, అందుకు అవసరమైన అవగాహన పెద్దలనుంచి ప్రభుత్వం ఇస్తున్న సూచనల నుంచి గ్రహించాలని కోరారు. ఈ మేరకు జోగింపేట, సీతానగరం, చినబోగిలి, పెదభోగిలి, బూర్జ, నిడగల్లు, మరిపివలస, గాదెలవలస, ఆర్.వెంకంపేట తదితర ప్రభుత్వ విద్యాలయాల మెయిన్ గేట్‌లకు పోలీసు సిబ్బంది ద్వారా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వంగలో సస్యరక్షణ



కాయతొలుచు పురుగు సోకిన వంగ మొక్క

గరుగుబిల్లి: వంగ మొక్కల సాగులో సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే దిగుబడి బాగుంటుందని మండల వ్యవసాయాధికారి ఆర్.రేఖ సూచించారు. వంగ మొక్కలు నాటిన 30–40 రోజుల నుంచి కాయతొలుచు పురుగు పంటను ఆశిస్తుదని, సకాలంలో గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. పురుగు సోకిన కాయలు వంకర్లు తిరిగిపోవడంతో పాటు కొమ్మల చివర పెరుగుదల ఆగిపోతోందన్నారు. దీని నివారణకు పురుగు ఆశించిన కొమ్మల చివర్లు తుంచివేసి కార్బరిల్ 50శాతం డబ్ల్యూపీ 3గ్రాములు గానీ, ప్రొఫెన్‌ఫాస్ 2 ఎం.ఎల్ గానీ, సైపర్ మైత్రిన్ 1 ఎం.ఎల్, లీటరు నీటిలో కలిపి 10 రోజుల వ్యవధిలో కాయలు కోసిన తర్వాత పిచికారి చేయాలన్నారు. తెల్లదోమ అధికంగా ఉన్నప్పుడు ఎసిఫేట్ 1.5గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలని సూచించారు. అలాగే ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చి వేయడం వలన ఆకులు పసుపురంగుకు మారి పైకి ముడుచుకొని ఉండిపోతాయని, దీని నివారణకు డైమిథోయేట్ గానీ, మిథైల్‌డెమెటాస్ గానీ ఫిప్రొనిల్ లీటరు నీటికి 2 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేయడం ద్వారా పురుగు బారి నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు.

ఆందోళనలో అరటి రైతు



వెంకటరాజపురంలో రోడ్డు పక్కన వదిలేసిన అరటి గెలలు

జియ్యమ్మవలస: గిట్టుబాటు ధర రాక అరటి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి వరకు రూ.150 నుంచి రూ.200 వరకు పలికే అరటి గెల ధర నేడు రూ.10లకు పడిపోవడంతో ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. గెలలను కోసి, మార్కెట్‌కు తీసుకు వెళ్లేందుకు అయ్యే ఖర్చులు కూడా రాకపోవడంతో కొందరు రైతులు పండిన అరటి గెలలను తోటలోనే విడిచిపెడుతున్నారు. గత సంవత్సరం తుపాను కారణంగా పంట నష్టపోయామని, ఈ ఏడాది పంట బాగున్నా ధర లేక నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. మండలంలో గవరమ్మపేట, బిత్రపాడు, సింగనాపురం, చింతలబెలగాం, బట్లబద్ర, జోగిరాజుపేట, బాసంగి, ఎం.హరిపురం, వెంకటరాజపురం తదితర గ్రామాల్లో అరటితోటలు ఎక్కువగా ఉన్నాయి.